

కాలువల్లో పూడికతీత..

వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురైంది. కనీసం కాలువల్లో పూడికతీతకు కూడా నిధులు మంజూరు చేయలేదు. సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టడం లేదంటూ ప్రతి జడ్పీ సమావేశాల్లో వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులే అధికారులపై మండిపడేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టింది. ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వంశధార, ఇతర సాగునీటి కాలువలలో పూడిక తీత పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది పుష్కలంగా సాగునీరందడంతో రైతుల్లో సంతోషం కనిపించింది. అలాగే 'ఆఫ్‌షోర్'కు రాష్ట్రంలో ఇతర ప్రాజెక్టులతో పాటు తొలిప్రాధాన్యం ఇస్తున్నట్లు తొలి బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించింది. ఆఫ్‌షోర్ కార్యరూపం దాల్చనుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

సంక్షేమ సంవత్సరం



ఉచితంగా గ్యాస్ సిలిండర్లు

- జూన్‌లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం
- ఏప్రిల్ నుంచే ప్రజలకు లబ్ధి
- ముందుగా పింఛన్ల పెంపు.. తర్వాత చెత్తపన్ను రద్దు
- ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ అమలు
- సాగునీటి రంగానికి ప్రాధాన్యం
- అంతటా ఉచిత ఇసుక
- ప్రభుత్వ పాలనపై సర్వత్రా హర్షం



శ్రీకాకుళం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ విధ్వంసకర పాలనతో గత ఐదేళ్లూ విసిగిపోయిన జిల్లావాసులకు.. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల రూపంలో సంక్షేమ సంవత్సరంగా మిగిలింది. జూన్ 4న కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఎన్నికల హామీ మేరకు ఏప్రిల్ నుంచే రూ.వెయ్యి చొప్పున పింఛన్ పెంపు వర్తించేలా ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. మరోవైపు జిల్లాలో ఐదేళ్లుగా మూతపడిన అన్నక్యాంటీన్లను మళ్లీ తెరిచింది. పేదలకు రూ.5కే కడుపు నిండా భోజనం అందజేస్తోంది. అలాగే ఉచిత ఇసుక విధానంతోపాటు ఏడాదికి మూడు చొప్పున ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. మరోవైపు చెత్త పన్ను సైతం రద్దు చేసింది. 'పల్లె పండుగ' పేరిట జిల్లాలో అధ్వానంగా ఉన్న రహదారులను బాగు చేస్తోంది. దీంతో కూటమి ప్రభుత్వ పాలనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

● పింఛన్‌దారులకు అండగా..



ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏప్రిల్ నుంచే సామాజిక పింఛన్లు రూ.వెయ్యి చొప్పున పెంచారు. జూలైలో రూ.4వేలతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రూ.3వేలు మొత్తంగా రూ.7వేలను పింఛన్ లబ్ధిదారులకు అందజేశారు. గతంలో వలంటీర్లు ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ వీలుకాదని వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ముందు వాదించారు. కాగా.. ప్రస్తుతం ఒకటో తేదీ నాటికే దాదాపు (మిగతా 6వ పేజీలో..)

ఉచితంగా గ్యాస్ సిలిండర్లు

వంట చేసే మహిళల ఇబ్బందులు దృష్ట్యా టీడీపీ ప్రభుత్వ హయాంలో దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. ప్రస్తుతం దీపం-2 పథకం కింద ఏడాది మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలోనే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు గత నెలలో ప్రారంభించారు. జిల్లాలో 2,10,780 మంది గ్యాస్ వినియోగదారులు ఉండగా.. ఇప్పటికే చాలామందికి తొలివిడతగా ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు. దీంతో మహిళల్లో ఆనందం ఉప్పొంగింది.

● చెత్తపన్ను రద్దు

జగన్ సర్కారులో అత్యంత మచ్చగా మిగిలిన చెత్త నిర్ణయం.. 'చెత్త పన్ను' విధించడం. అధికారంలోకి రాగానే చెత్త పన్నును రద్దు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రకటించారు. అదేరీతిన అధికారంలోకి వచ్చాక 'చెత్త'పన్నును రద్దు చేశారు. దీంతో పట్టణ ప్రజలకు నెలవారీగా భారీ ఊరట కలిగింది.

ఇబ్బందులు లేకుండా సాగునీరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వంశధార ప్రధాన కాలువలు అభివృద్ధికి కనీసం నిధులు కేటాయించలేదు. ప్రాజెక్టు నుంచి నీరు విడిచిపెడితే పలుచోట్ల గండ్లు పడేవి. దీంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు పూడిక తీత పనులతో పాటు కాలువ గట్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. శివారు భూములకూ సాగునీరందిస్తున్నారు.

- గోళ్ళ సింహాచలం, అక్కరాపల్లి, హిరమండలం

సైబర్ కేటుగాళ్లు



- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- సామాజిక మాధ్యమాల్లో లైక్‌ల పేరిట దోపిడీ
- ఫోన్‌కాల్స్ ద్వారా బెదిరిస్తూ డబ్బుల డిమాండ్
- ఓటీపీ నెంబరు చెబితే బ్యాంకు ఖాతా ఖాళీనే

- మూడేళ్ల కిందట.. కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో డబ్బులు విత్‌డ్రా చేసేందుకు ఓ రైతు వెళ్లాడు. ఆయనకు పిన్ నెంబర్, పాస్‌వర్డ్ ఎలా నమోదు చేయాలో తెలియక అక్కడ ఉన్న అపరిచిత వ్యక్తికి ఏటీఎం కార్డు ఇచ్చి.. అందులో రూ.5వేలు తీయాలని కోరాడు. ఆ వ్యక్తి ఏటీఎం కార్డు పెట్టి.. నెంబర్లు నొక్కినట్టు నటించి అందులో డబ్బులు లేవని చెప్పాడు. దీంతో ఆ రైతు వెనుదిరిగాడు. అయితే ఆ ఏటీఎం కార్డును అపరిచిత వ్యక్తి తస్కరించి.. ఆయన చెప్పిన పిన్ నెంబర్ ఆధారంగా రూ.50వేల వరకూ విత్‌డ్రా చేశాడు. నాలుగు రోజులపాటు బ్యాంకులో ఉన్న నగదంతా ఖాళీ చేసేశాడు. ఆ రైతు బ్యాంకుకు వెళ్లి.. డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించగా బ్యాలెన్స్ లేదని సిబ్బంది చెప్పారు. దీంతో తాను ఏటీఎం కేంద్రం వద్ద మోసపోయానని తెలుసుకుని లబోదిబోమన్నాడు.
- రెండేళ్ల కిందట పలాస మండలానికి చెందిన ఓ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి.. తన ఉద్యోగ విరమణ సమయంలో బ్యాంకు ఖాతాలో జమైన రూ.5లక్షలను ఇంటి అవసరాలకు వినియోగించాలనుకున్నాడు. ఇంతలో ఓ అపరిచిత వ్యక్తి ఆయనకు ఫోన్ చేశాడు. 'బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం. మీ డబ్బులు జాగ్రత్తగా వినియోగించండి' అని హిందీలో చెప్పాడు. మీకు ఓటీపీ వస్తుందని.. వెంటనే ఆ నెంబర్ చెప్పాలని కోరారు. ఆ విధంగా రైల్వే ఉద్యోగి చేయగా.. పది నిమిషాల్లో ఆయన బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు అంతా ఖాళీ అయిపోయింది. డబ్బులు తీసినట్లుగా సమాచారం రావడంతో ఆయనకు బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా అప్పటికే నష్టం జరిగిపోయింది.
- ఇటీవల చిన్నబడాం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడుకి పోలీసు డ్రస్ వేసుకుని ఓ వ్యక్తి తొలుత వాట్సాప్‌లో వీడియో కాల్ చేశారు. తర్వాత నేరుగా ఫోన్‌లో సంభాషిస్తూ 'మీ కుమారుడు సైబర్ నేరంలో ఇరుక్కున్నాడు. ఎటువంటి కేసు లేకుండా ఆయన్ను విడుదల చేయాలంటే రూ.2లక్షలు తక్షణమే మా బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయాల'ని డిమాండ్ చేశారు. దీంతో ఉపాధ్యాయుడు ఏమిచేయాలో తెలియక తక్షణమే స్నేహితుల అకౌంట్ల నుంచి నగదు తెప్పించుకుని వారికి బదిలీ చేశాడు. కొద్దిసేపటి తర్వాత తన కుమారుడికి ఫోన్ చేయగా.. అలాంటిదేమీ లేదని చెప్పడంతో తాను మోసపోయినట్టు గుర్తించాడు. ఈ ఘటనపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పలాస, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కొత్తదారుల్లో దోచుకుంటున్నారు. యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియా పోస్టులకు లైకులు కొడితే ఎక్కువ మొత్తం డబ్బులు ఆఫర్ ఇస్తామని ప్రజలను నమ్మబలుకుతున్నారు. అక్కడ నుంచి కథ మొదలవుతుంది. తమతో పెట్టుబడులు పెడితే రెట్టింపు నగదు ఇస్తామని ఆశ చూపిస్తూ.. మొత్తం ఊడ్చుకుపోతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. 5జీ సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత మరిన్ని మోసాలు పెరిగాయి. దేశంలో ప్రతి నిమిషానికి 700 పైగా సైబర్‌నేరాలు జరుగుతున్నాయని సాక్షాత్తు కేంద్ర సైబర్ నేర నివృత్త సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. నిత్యం ఫోనుల్లో వివిధ భాషల్లో సైబర్ క్రైమ్ ఎలా జరుగుతుంది?. దాని నుంచి ఎలా అప్రమత్తం కావాలో చెబుతున్నా నేరాలు మాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా చదువుకున్న వారే ఇటువంటి నేరాలకు బాధ్యులు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఆన్‌లైన్ మోసాలు, గేమ్స్, స్టాక్‌ఎక్స్ఛేంజ్, ఆన్‌లైన్ షాపింగ్‌ల్లో ఎక్కువగా ఇటువంటి మోసాలు జరుగుతున్నాయనేది స్పష్టమవుతోంది. దీని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి జిల్లాలోను సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరంలోనైనా సైబర్ నేరాలు తగ్గుముఖం పడతాయో లేదోనని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వంతోపాటు ఐటీ రంగ నిపుణులు కూడా సైబర్‌క్రైమ్ నివారణకు చర్యలు చేపట్టాలని అభిప్రాయపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



సైబర్‌నేరాలు, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించే ముందు సమాచారాన్ని ధ్రువీకరించుకోండి. సామాజిక మాధ్యమాల్లో అనుమానిత లింక్‌లు క్లిక్ చేయవద్దు. నగదు లావాదేవీలను బ్యాంకుల ద్వారే నిర్ధారించుకోవాలి. అనుమానిత కాల్స్, నెంబర్లపై తక్షణమే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. 1930 నెంబర్‌కు ఫోన్ చేస్తే తగు రక్షణ కల్పిస్తాం. అధిక రాబడి పథకాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కేవైసీని వ్యక్తిగతంగా, బ్యాంకుల ద్వారా మాత్రమే చేయాలి. వ్యక్తిగత, బ్యాంకు వివరాలు ఎవరితో పంచుకోవద్దు.

- వి.వెంకట అప్పారావు, డీఎస్పీ, కాశీబుగ్గ

ఒక్కరోజు ముందే పింఛన్లు

నరసన్నపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది వేళ.. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజు ముందే లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేయనుంది. ఈ నెల 31నే పింఛన్ అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 3,13,255 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో వృద్ధులు 1,66,406 మంది, వితంతువులు 74,027 మంది, దివ్యాంగులు 31,584 మంది, మిగిలిన లబ్ధిదారులు 41,238 మంది ఉన్నారు. వీరికి రూ.128.55కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం అధికారులు ఈ నగదును బ్యాంకుల్లో విత్‌డ్రా చేసి.. మంగళవారం పంపిణీ చేయనున్నారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

● 31 వరకు ఫిర్యాదుల స్వీకరణ: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'గ్రామ, వార్డు సచివాలయాల్లో కులగణన వివరాలు ప్రదర్శిస్తాం. ఈ నెల 31 వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తాం. జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామ'ని కలెక్టర్ తెలిపారు. 'పేరు, ఆధార్ నెంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం ఇతర వివరాలను పరిశీలించి ఆర్‌ఐకి నివేదిస్తారు. వీటిని తహసీల్దార్ పరిశీలించి తుది ఆమోదం తెలిపాక, ఆ వివరాలను పోర్టల్‌లో పొందుపరుస్తారు. ఈ వివరాలను సాంఘిక సంక్షేమ అధికారులతో ర్యాండమ్‌గా తనిఖీ చేసి, సోషల్ ఆడిట్‌ను తాను, ఆర్డీవోలు పర్యవేక్షిస్తామ'ని కలెక్టర్ వెల్లడించారు.

కిడ్నీ వ్యాధితో వివాహిత మృతి



మోహిని (ఫైల్)

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం రాజాం గ్రామానికి చెందిన వివాహిత బొడ్డు మోహిని(40) శుక్రవారం ఉదయం కిడ్నీ వాధితో మృతి చెందింది. ఈమె నాలుగేళ్లుగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ పలాసలోని ఆస్పత్రిలో డయాలసిస్ చికిత్స పొందేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు భర్త మహేష్‌తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మోహిని మృతిపై స్థానిక మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు పోతనపల్లి సాంబమూర్తి, చెల్లూరు రాజశేఖర్ సంతాపం తెలిపారు. కాగా, రాజాంతో గతంలో ఒకరు కిడ్నీవ్యాధితో మృతిచెందారని, ప్రస్తుతం మరో ఇద్దరు ఈ వ్యాధితో బాధపడుతూ.. డయాలసిస్ చేయించుకుంటున్నారని సాంబమూర్తి తెలిపారు.



జోగారావు (ఫైల్)

తాను మరణించి.. మరి కొందరిలో జీవించి!

● అవయవ దానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు

6లో

దేహదారుఢ్య పరీక్షలకు ఏర్పాట్లు

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

7లో

వారు ముఖం చాటేశారు

● విద్యుత్ ధర్నాకు ముఖ్య నేతల గైర్హాజరు

శ్రీకాకుళంఅర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైసీపీ చేపట్టిన పోరుబాటకు నాయకత్వం కొరవడింది. విద్యుత్ చార్జీల పెంపుపై కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జిల నాయకత్వంలో ధర్నాలు చేపట్టాలని వైసీపీ అధిష్ఠానం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాగా.. ఈ కార్యక్రమానికి కూడా మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ దువ్వాడ ముఖం చాటేశారు. మిగిలిన చోట్ల మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావుతోపాటు ఆయన కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు కూడా హాజరు కాలేదు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నరసన్నపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడంతో.. జిల్లాకేంద్రంలో నాయకత్వం కొరవడిందనే విమర్శలు వినిపించాయి. నగర అధ్యక్షుడు, మండలస్థాయి నాయకులు శుక్రవారం సూర్యమహల్ కూడలి నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు.



విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

విశాలమైన తోటూరు తీరం



- పర్యాటకంపై దృష్టి సారించని పాలకులు
- వసతులు కల్పిస్తే యువతకు ఉపాధి

విశాల తీరం.. అభివృద్ధి శూన్యం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సువిశాలమైన సాగర తీరం కలిగిన జిల్లాలో ఆశించిన మేర పర్యాటక అభివృద్ధి జరగడం లేదు. పర్యాటకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉన్నా.. ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టడంలేదు. జిల్లాలో అత్యధిక తీర ప్రాంతం కలిగిన మండలాల్లో వజ్రపుకొత్తూరు ఒకటి. దాదాపు మండలం అంతా తీరప్రాంతాన్ని ఆనుకుని ఉంది. తీరప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో పర్యాటకులకు ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం వజ్రపుకొత్తూరు మండలం శివసాగర్ బీచ్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. అయితే నేటికీ అవి కొలిక్కిరాలేదు. దివంగత నేత ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో తీర ప్రాంతంలో మత్స్యకారుల కోసం నిర్మించిన విశ్రాంతి భవనాలు, ఫిష్ ల్యాండింగ్ ప్లాట్‌ఫారాలు తప్ప.. ఎలాంటి నిర్మాణాలు జరగలేదు. శివసాగర్‌బీచ్, దేవునల్తాడ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామంటూ వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. కానీ ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చలేదు. ప్రధానంగా మండలంలోని శివసాగర్ బీచ్, తోటూరు, వజ్రపుకొత్తూరు, డోకులపాడు, మంచినీళ్లపేట, కొత్తపేట, దేవునల్తాడ తీరాలకు నిత్యం పర్యాటకుల తాకిడి ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో వచ్చి ఆహ్లాదం పొందుతుంటారు. తోటూరు తీరంలో ఎర్రమట్టిదిబ్బలు కూడా పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. అయితే కూర్చోవడానికి బెంచీలు కానీ, తాగునీటి వసతి కానీ లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. తీరప్రాంతాల్లో కనీస వసతులు కల్పిస్తే.. పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తోటూరు తీరంలో ఎర్రమట్టి దిబ్బలు


అభివృద్ధి పనులు చేపట్టండి



శివసాగర్ బీచ్, తోటూరు బీచ్‌లను అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. టీడీపీ హయాంలో శివసాగర్ బీచ్‌లో పర్యాటకంగా అభివృద్ధి పనులు మొదలయ్యాయి, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేయలేదు. నిత్యం వందలాది మంది పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు.

- తెప్పల చాణక్య, బైపల్లి

సుదూర ప్రాంతాల నుంచి రాక



మండలంలోని సముద్ర తీరప్రాంతాలకు ఒడిశా నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. తీరంలో ప్రసిద్ధ ఆలయాలు ఉండడంతో విహార యాత్రలకు వచ్చేవారి సంఖ్య అధికంగానే ఉంటుంది. పర్యాటకులకు ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవు. స్థానికులే బెంచీలు ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారు. బీచ్‌ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- నాగేశ్వరరావు, శివాలయం అభివృద్ధి కమిటీ ప్రతినిధి, బైపల్లి

ఉపాధ్యాయ మణిపాత్రుని


ముద్దాడ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనంలో తర్ఫీదునిస్తూ...

ఎచ్చెర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి)

ఆయన ఓ ఉపాధ్యాయుడు. కానీ తరగతి గదిలో బోధనకే పరిమితం కావడం లేదు. బహుముఖ ప్రజ్ఞతో గుర్తింపు తెచ్చుకున్నారు. విభిన్న రంగాల్లో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నారు. తన విద్యను, నైపుణ్యాలను విద్యార్థులకే కాకుండా, ఔత్సాహికులకూ అందిస్తున్నారు. ఆయన చేపట్టే సమాజహిత కార్యక్రమాలను గుర్తించిన వివిధ సంఘాలు, అసోసియేషన్ల వారి నుంచి ఇప్పటి వరకు 959 సన్మానాలు పొందారు. ఆయనే ఎచ్చెర్ల మండలం ముద్దాడ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు... జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావు.

- బహుముఖ ప్రజ్ఞ ఆయన సొంతం
- ఉత్తమ ఉపాధ్యాయునిగా జాతీయ అవార్డు
- చిత్రలేఖనంలో పేరు ప్రఖ్యాతులు
- ఎంసీఏ పేరిట ఔత్సాహికులకు శిక్షణ
- ఇప్పటి వరకూ 959 సన్మానాలు



అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న మణిపాత్రుని నాగేశ్వరరావు



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటూ...

ఉత్తమ ఉపాధ్యాయునిగా..

1984లో కొత్తూరు మండలం శోభనాపురం ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు చేపట్టడం ద్వారా ఉపాధ్యాయునిగా తన ప్రస్థానం ప్రారంభించారు మణిపాత్రుని నాగేశ్వరరావు. వృత్తిలో అంకితభావం కారణంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డులు సాధించారు. బోధనతో పాటు చిత్రకళ, సంగీతంలోనూ పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. 2007లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 2013లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం అందుకున్నారు. 2018లో బెస్ట్ ఎక్సలెన్స్ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి అందుకున్నారు.

బాలరంజని సంస్థ ఏర్పాటుతో-

బాల బాలికల్లో అంతర్గత శక్తులను బయటకు తీసేందుకు బాలరంజని సంస్థను నాగేశ్వర రావు మాస్టారు నెలకొల్పారు. ఈ సంస్థ ద్వారా పిల్లలు కథలు, కవితలు రాసే నైపుణ్యాన్ని పొందేలా తర్ఫీదునిస్తున్నారు. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేలా ప్రోత్సహిస్తున్నారు. ఏటా రెండుసార్లు పద్యాలు, కథలు చెప్పడంలోనూ.. చిత్రలేఖనం, నృత్యం పోటీలను నిర్వహించి బహుమతులను అందజేస్తున్నారు.

ఎంసీఏ ద్వారా...

సుమారు రెండేళ్ల కిందట మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ (ఎంసీఏ)ని ప్రారంభించి.. తన తండ్రి ఉదయభాస్కర్ పేరిట జిల్లా స్థాయిలో కవులు, కళాకారులు, నటులు, రచయితలకు ఉగాది పురస్కారాలను అందజేస్తున్నారు. ఎంసీఏ ద్వారా నటన, సంగీతం, చిత్రలేఖనంలోనూ తర్ఫీదునిస్తున్నారు.

చిత్రలేఖనంలో...

స్వతహాగా చిత్రకారుడైన నాగేశ్వరరావు మాస్టారు ఏ పాఠశాలలో పనిచేసినా అక్కడి విద్యార్థులు చిత్రలేఖనంలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ముద్దాడ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు, అవార్డులు పొందేలా ప్రోత్సహించారు. చిత్రలేఖనంలో నాగేశ్వరరావు మాస్టారు 2016లో ఇండియన్ ఐకాన్ అవార్డు, 2020లో తానా పురస్కారాన్ని అందుకున్నారు.

కవిగా గుర్తింపు..

అనంతపురంలో 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు, రాజమండ్రిలో 2023లో జరిగిన తెలుగు మహాసభలలో ఉత్తమ కవితా పురస్కారాలను అందుకున్నారు. 2022లో గోదావరి పురస్కారం, అమరావతి, కృష్ణా పురస్కారాలను సాధించారు. ఈ మాస్టారు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాకు 2016లో నంది అవార్డు వరించింది.

959 సన్మానాలు..

ఒకటీ... రెండూ కాదు... ఏకంగా 959 సన్మానాలు... సత్కారాలు పొందారు మణిపాత్రుని నాగేశ్వరరావు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఆయన అనేక సన్మానాలు పొందారు. సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటున్నారు. తన వద్ద చదువుకున్న పిల్లలకు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే తానే ఆసుపత్రికి స్వయంగా తీసుకువెళ్లి వారికి వైద్యం చేయిస్తుంటారు. పేద విద్యార్థులకు అండగా ఉంటూ వారు చదువుకోవడానికి తనకు తోచిన సాయాన్ని చేయడం ఆయనకు అలవాటు. ఇలాంటి మాస్టారు ఎందరికో ఆదర్శం... స్ఫూర్తి అనడంలో అతిశయోక్తి కాదేమో.



మన్మోహనుడి సైకత శిల్పం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సైకత శిల్పాన్ని రూపొందించి... ఓ కళాకారుడు ఘనంగా నివాళులర్పించారు. గాజుల కొల్లివలస గ్రామానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ సంగమేశ్వర కొండ సమీపంలో మన్మోహన్‌సింగ్ సైకత శిల్పాన్ని రూపొందించారు. గ్రామానికి చెందిన యువతీ యువకులు కొవ్వొత్తులు వెలిగించి... ఆ సైకత శిల్పం వద్ద శుక్రవారం నివాళులర్పించారు.

-ఆమదాలవలస, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి)



సుద్దముక్కపై మన్మోహన్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రాన్ని సుద్ద ముక్కపై చెక్కి ఘనంగా నివాళులు అర్పించాడు ఓ కళాకారుడు. కాశీబుగ్గ గాంధీ నగర్‌కు చెందిన కొత్తపల్లి రమేష్ శుక్రవారం మన్మోహన్ సింగ్ బొమ్మను సుద్ద ముక్కపై చెక్కి రంగులు వేశాడు. ఆ చిత్రం ద్వారా శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు రమేష్ తెలిపారు.

-కాశీబుగ్గ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి)



ఊడల మర్రి ఊసులు తెలుసా?

మెళియాపుట్టి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనగనగా ఓ మర్రిచెట్టు. చెట్టు నిండా ఊడలు. అవి పిల్లలకు ఊయలలు. పెద్దవారికి సేదదీర్చే పచ్చని నీడలు. విశ్రాంత ఉద్యోగులకు జ్ఞాపకాలను నెమరువేసుకునే స్మృతుల కొమ్మలు. యువత కబుర్లు పంచుకునేందుకు.. ప్రేమ సందేశాలు మోసుకొచ్చే పావురాలకు నిలయాలు. ఇందరికి.. ఇన్నివిధాలుగా ఉపయోగపడుతున్న ఆ చెట్టు మెళియాపుట్టి మండలం రట్టిణి గ్రామంలో పాత.. కొత్తతరాలకు వారధిగా కనిపిస్తోంది. ఎన్నో తుపాన్లు... ఇంకెన్నో విపత్తులను తట్టుకొని నిలిచిన ఈ చెట్టుతో తమది విడదీయలేని బంధమని చెబుతారు ఆ గ్రామ ప్రజలు. ఒడిశాలోని అమర్.. ఆంధ్రాలోని రట్టిణి గ్రామస్థులు చందాలు వేసుకొని.. దీని కింద చిన్నపాటి బెంచీలు నిర్మించుకున్నారు. పరిసర గ్రామాల ప్రజలంతా దీని నీడన సేదదీరుతుంటారు.


జోగారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

తాను మరణించి.. మరికొందరిలో జీవించి!

- అవయవ దానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు

అరసవల్లి/మందస/హరిపురం,డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మరణించినా... అవయవ దానంతో మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. వివరాల్లోకి వెళితే.... ఈ నెల 25న మందస మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సొండిపూడి లైన్‌మెన్ కె.జోగారావు(28) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు ఆయనను చేర్పించారు. ఆయనకు చికిత్స చేసిన వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి... అవయవ దానంపై అవగాహన కల్పించారు. దాంతో జోగారావు తల్లిదండ్రులు, బంధువులు అవయవ దానానికి అంగీకరించారు. అతని గుండెను చెన్నై ఎంజీఎంకు, ఒక కిడ్నీని వైజాగ్ మెడికవర్‌కు, మరో కిడ్నీని విశాఖపట్నం కిమ్స్‌కు, ఊపిరితిత్తులు హైదరాబాద్ కిమ్స్‌కు గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వైద్యులు డా.దానేటి శ్రీధర్, డా.పైల మురళీధర్, డా.గురుగుబెల్లి సందీప్, ఆసుపత్రి సిబ్బంది జోగారావుకు ఘనంగా నివాళులర్పించారు.

మన్మోహన్‌తో మరచిపోలేని బంధం

కోటబొమ్మాళి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌తో జిల్లాలోని ఇద్దరు కీలక నేతలది మరచిపోలేని అనుబంధమని చెప్పక తప్పదు. ప్రస్తుత విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు రాజకీయ అరంగేట్రం చేసిన తొలి రోజుల్లో బాబాయి అచ్చెన్నాయుడుతో పాటు వెళ్లి... మన్మోహన్ సింగ్‌ను కలిశారు. జిల్లా సమస్యలను వివరించారు. దివంగత నేత ఎర్రన్నా యుడుతో తనకు ఉన్న అనుబంధాన్ని మన్మోహన్ గుర్తు చేసుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు నెమరు వేసుకుంటున్నారు. మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు తన సంతాపాన్ని తెలియజేశారు.


మన్మోహన్‌సింగ్‌తో రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్న(ఫైల్)

కళాశాలల కథ అంతేనా?

- సౌకర్యాల లేమితో అవస్థలు
- ఫలితమివ్వని నాడు-నేడు

మెళియాపుట్టి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అసౌకర్యాలకు నిలయంగా మారాయి. కొన్ని చోట్ల తరగతి గదులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోకగా... మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు సరిగా లేవు. ఇంకొన్ని చోట్ల ప్రహరీలు లేవు. దీంతో పశువులు.. పందులు కళాశాలల ఆవరణల్లోకి ప్రవేశిస్తున్నాయి. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. నాడు-నేడు పథకంతో కళాశాలల రూపురేఖలు మార్చామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 235 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ వివిధ అభివృద్ధి పనులకు నాడు-నేడు పథకంలో రూ.42లక్షల 23 వేల 634 మంజూరు చేశారు. కానీ అరకొరగా పనులు చేసి వదిలేశారు. కళాశాలకు ప్రహరీ లేదు. సరిపడే మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఉన్న మరుగుదొడ్లకు తాళాలు వేశారు. దీంతో మరుగుదొడ్డి కోసం మెళియాపుట్టి-పలాస రోడ్డు దాటి అవతలి వైపునకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పనులను కొంత మంది వైసీపీ నాయకులకు అప్పగించటంతో పాటు పర్యవేక్షించే వారు లేకపోయారు. దీంతో అడుగడుగునా నాణ్యతా లోపం కనిపిస్తోంది. అక్కడే కాదు.. అధికశాతం కళాశాలల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి.


మెళియాపుట్టి జూనియర్ కళాశాల ఆవరణలో మరుగుదొడ్లకు తాళాలు వేసిన దృశ్యం


కళాశాల మైదానంలో వదిలేసిన రాయి

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 5,819 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళాశాలల్లో భవనాలు, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనకు 2020లో వైసీపీ ప్రభుత్వం మొదటి విడతలో నాడు-నేడు కింద రూ.13 కోట్ల 80 లక్షల 67 వేల 701 మంజూరు చేసింది. చేసిన పనులకు సకాలంలో బిల్లులు కాక అధిక శాతం కళాశాలల్లో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మరికొన్నిచోట్ల పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మెళియాపుట్టి జూనియర్ కళాశాల మైదానంలో ఇసుక, రాయిని వదిలేశారు. దీంతో విద్యార్థులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లను అలాగే వదిలేశారు. ఇవి వినియోగించడానికి వీలు లేకుండా ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..

వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పనులను కూటమి ప్రభుత్వం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులుర కోరుతున్నారు. దీనిపై కొన్ని కళాశాలల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలుస్తోంది. ఆమేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి... కళాశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

'సంక్షేమ' సంవత్సరం

(ఐదో పేజీ తరువాయి)

వందశాతం పూర్తయ్యేలా సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. టీడీపీ హయాంలో రూ.2వేలు ఉన్న సామాజిక పింఛన్‌ను.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదికి రూ.250 చొప్పున పెంచింది. గత నాలుగేళ్లలో రూ.3వేలకు చేరింది. దీనికి అదనంగా రూ.వెయ్యి చొప్పున కూటమి ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే దివ్యాంగులకు రూ.6వేలు చొప్పున పింఛన్ పంపిణీ చేస్తోంది. సీకేడీ రోగులు, ఇతర తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కూడా పింఛన్ మొత్తాన్ని భారీగా పెంచింది. జిల్లాలో మొత్తం 3,14,385 పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.128.40 కోట్లు వెచ్చిస్తోంది. దీంతో పింఛన్‌దారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

ఇసుక వ్యాపారంతో కోట్లు సంపాదించుకున్న వైసీపీ నాయకులు..

జిల్లాలో వంశధార, నాగావళి నదుల్లో ఇసుక నిల్వలు అపారంగా ఉన్నాయి. గత ఐదేళ్ల.. వైసీపీ హయాంలో మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇసుక విక్రయాలతో కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారు. ఇసుకను లారీలతో విక్రయిస్తూ.. సామాన్యులు ఇళ్లు నిర్మించుకునేందుకు కూడా ఇబ్బంది కల్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోంది. రీచ్‌ల వద్ద రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేస్తోంది. కాగా.. ఇప్పటికీ ఇసుక తరలింపులో లోపాలున్నా.. వైసీపీ హయాం మాదిరిగా బరితెగింపులేదన్నది వాస్తవం. ఇదిలా ఉండగా పలాస సమీపంలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఓ వైపు సంక్షేమ పథకాలతోపాటు.. మరోవైపు అభివృద్ధి దిశగా కూడా చర్యలు చేపడుతుండడంతో కూటమి ప్రభుత్వ పాలనపై జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరింత ఆర్థిక భద్రత..



సామాజిక పింఛను పెంపు వల్ల వేలాది మంది వృద్ధులు, దివ్యాంగులకు మరింత ఆర్థిక భద్రత లభించింది. నెల వారీ మందులు.. ఇతరత్రా వైద్య ఖర్చుల కోసం ఎవరిపైనా ఆధారపడకుండా ప్రభుత్వం భరోసా కల్పించింది.

-జగదీశ్వరరావు, ఇచ్ఛాపురం

ఉచితంగా సిలిండర్ ఇచ్చారు..



రెండు దశాబ్దాల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో మాకు దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ మంజూరు చేశారు. అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే. ఇప్పుడు మళ్లీ ఆయన హయాంలోనే దీపం-2 పథకం కింద ఉచిత సిలెండరు ఇచ్చారు. మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఊరట కల్పించారు.

-శ్యామలమ్మ, కంచిలి

రేపు కోటి దీపోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న అష్టలక్ష్మి పుష్పయాగ సహిత కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్టు నానుబాబాల వారి వీధిలోని విజయదుర్గ ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ తెలిపారు. ఏడు రోడ్ల కూడలి సమీపాన ఎన్‌టీఆర్ మున్సిపల్ మైదానంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ దీపోత్సవాల్లో ప్రముఖ తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పశర్లపాటి శ్రీనివాస్ బంగారయ్య శర్మ ప్రవచనాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

నేడు వర్సిటీ కళాశాలలకు సెలవు

ఎచ్చెర్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలకు శనివారం సెలవును ప్రకటించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

రణస్థలం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని గ్రేడ్ వన్ అధికారి ప్రసాద్ అన్నారు. జేఆర్ పురం జాతీయ రహదారికి ఇరువైపుల వ్యాపారులు రోడ్డుపై చెత్త వేయకుండా షాపుల వద్ద ఉంచాలని, స్వచ్ఛ సేవకులు తీసుకెళ్తారన్నారు. శుక్రవారం ఆయన వ్యాపారులతో మాట్లాడారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.

'కిమ్స్' ఫౌండేషన్‌కు ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న బొల్లినేని మెడిస్కిల్స్ ఈడీ నాగేశ్వరరావు

అరసవల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాదులోని కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ యువత నైపుణ్యాభి వృద్ధికి ఉభయ రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలకు తగిన గుర్తింపు లభించింది. కీట్స్ ఫౌండేషన్ వారు ఆ సంస్థకు ఉత్తమ భాగస్వామి శిక్షణ కేంద్రం అవార్డును అందించారు. ఎన్టీఆర్ జిల్లాలోని అంబరుపేట వద్ద గల సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు రాట్‌గర్స్ యూనివర్సిటీ (న్యూజెర్సీ) రిజిస్ట్రార్ ఎ.విజయలక్ష్మి నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో యువత నైపుణ్యాభివృద్ధికి గత ఎనిమిదేళ్లుగా కృషి చేస్తున్నామన్నామని, వేలాదిమంది నిరుద్యోగులకు వివిధ నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఉచితంగా అందజేసి ఉపాధి కల్పించామన్నారు. కీట్స్ సంస్థతో కలిసి పనిచేసిన తొలి ఏడాదిలోనే ఈ అవార్డు సాధించడం తమకు ప్రత్యేకమన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, కీట్స్ ఛైర్మన్ డీవీ గిరిధర్, వైస్ ఛైర్మన్ జి.జనార్దనరావు, మేనేజింగ్ ట్రస్టీ, వైఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని వెనక్కి తీసుకోవాలి

రణస్థలం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విధించిన విద్యుత్ చార్జీల భారాన్ని వెనుక్కితీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కరెంటు చార్జీల బాదుడుపై వైసీపీ పోరబాట నిరసన ర్యాలీ శుక్రవారం రామతీర్థం జంక్షన్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకూ చేపట్టారు.

● ఆమదాలవలస, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలపై వేసిన విద్యుత్ చార్జీల భారాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. వన్‌వే జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ ఏఈ జి.రామారావుకు వినతిపత్రం అందించారు. వైసీపీ నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, ఖండాపు గోవిందరావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై విస్తృత తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆమదాలవలస, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాపై రాష్ట్ర పోలీస్‌శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎస్‌ఐ కె.వెంకటేష్ విస్తృత తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్‌తో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో కొంతమంది ప్రయాణికుల లగేజీతో పాటు కొన్ని రైళ్లల్లో కూడా పోలీసులు తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాలతో పాటు సీఎస్‌పీ ప్రధాన రహదారిలో వాహనాలు తనిఖీ చేశారు.

● పొందూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పొందూరు మహరాజా మార్కెట్‌లో సోదాలు చేపట్టారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్‌ఐ ఈ.చిన్నమనాయుడు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రత్తకన్నలోని వినాయక విద్యానికేతన్ పాఠశాలలో ఛైర్మన్ జి.కృష్ణమూర్తి అధ్యక్షతన మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనార్థాలపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి.కోకిల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో డ్రోన్లతో నిఘా



● అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి
● ప్రశాంత సిక్కోలు లక్ష్యం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలపై జిల్లా పోలీసు యంత్రాంగం డ్రోన్ కెమెరాల సహాయంతో నిఘా ఏర్పాటు చేసింది. శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో డచ్ బంగ్లా, గుడివీధి, కంపోస్టు కాలనీ, అరసవల్లి, నాగావళినది పరివాహక ప్రాంతాలతోపాటు పలు ప్రాంతాల్లో పాడుపడిన బంగ్లాలు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో పోలీసులు పలు చిత్రాలు తీసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. నేర నియంత్రణే లక్ష్యంగా డ్రోన్ కెమెరాల సాయంతో పోలీసులు పహారా కాస్తున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రశాంత సిక్కోలు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైన పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రోన్ సాయంతో నదీ పరివాహక ప్రాంతాల పరిశీలన →



దేహదారుఢ్య పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలి


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ (స్టయిఫెండరీ) పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న దేహదారు ఢ్య పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. సా యుధ మైదానాన్ని ఆయన శుక్రవారం సందర్శించి పరిశీలించారు. అభ్యర్థుల ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలను, ధ్రువ పత్రాల పరిశీలనకు కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 100, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్‌ల నిర్వహణకు సిద్ధం చేసిన ట్రాక్‌లను పరిశీలించారు. ఏఎస్పీ కేవీ రమణ, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఏవో గోపీనాథ్, సీఐ అవతారం, ఆర్ఐ నర్సింగరావు, ఎస్‌ఐ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు పటిష్ఠ చర్యలు


ఫాగింగ్ యంత్రాలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

అరసవల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా, డెంగ్యూ నివారణకు కట్టుదిట్టమైన పటిష్ఠ చర్యలను తీసుకోనున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. వారి కార్యాలయ ఆవరణలో జిల్లాకు మంజూరైన ఫాగింగ్ మెషీన్లను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా జిల్లాకు 50 ఫాగింగ్ మెషీన్లు అందించారన్నారు. ఈ ఫాగింగ్ యంత్రాలను జిల్లాలోని అన్ని మండల పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచి దోమలను నివారించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడం జరుగుతోందని, అందులో 15 ఆరోగ్య కేంద్రాలను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన రెండు ఆరోగ్య కేంద్రాలు పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, అదనపు వైద్యారోగ్యశాఖాధికారి టి.శ్రీకాంత్, డెమో వెంకటేశ్వర్లు, వీబీడీ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి, జిల్లా మలేరియా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

● సాఫ్ట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్


ఎమ్మెల్యే రవికుమార్‌ను సత్కరిస్తున్న జిల్లా పీఈటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్/ఆమదాలవలస, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న ఉపాధి అవకాశాల పోటీల్లో ఎంతో ప్రాధాన్యం కలిగిన క్రీడల్లో యువత రాణించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం విజయవాడలో శాప్ ఛైర్మన్ ఎ.రావినాయుడు ఆధ్వర్యంలో నిర్వ హించిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రవికుమార్‌ను ఘనంగా సత్కరించా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధితో పాటు పరిశ్రమలను స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సీఈవో సి.వెంకటేషులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంపీ రమణ, ట్రెజరర్ నర్సింరెడ్డి, ఏపీపీఈటీ సంఘం గౌరవ అధ్యక్షుడు కరిముల్లా చౌదరి, కార్యదర్శి సి.నాగేంద్ర పాల్గొన్నారు.

నాణ్యతలోపిస్తే చర్యలు

పొందూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న రోడ్డుతో ఇబ్బందిపడుతున్న పొందూరులోని కనకలవీధివాసులకు ఊరట లభిస్తోంది. ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో మార్కెట్ నుంచి కాకర్ల నర్సింగహోం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే గాంధీనగర్‌వీధి, జల్లేపల్లివీధి, మాడుగుల వీధి, కనకలవీధి వాసులకు రోడ్డుకష్టాలు తప్పుతాయి. ఈ పనులను శుక్రవారం పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్, ఈవో, మోహన్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ పరిశీలించారు. నాణ్యతలోపిస్తే చర్యలు తప్పవని డీఈ హెచ్చరించారు.

ఎయిర్‌మెన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌మెన్ (మెడికల్ అసిస్టెంట్స్) పోస్టులకు భారత వాయుసేన, కమాండింగ్ ఆఫీసర్ 12, ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, సికింద్రాబాద్ వారు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బయోలజీ, డిప్లమో/బీఎస్సీ ఫార్మసీ విద్యార్హతలు కలిగిన అవివాహిత భారతీయ పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఇంటర్ (బయోలజీ) చదివిన పురుష అభ్యర్థులు 50 శాతం మార్కులు, ఇంగ్లీష్‌లో కూడా 50 శాతం మార్కులు కలిగి, 2004 జూలై 3 నుంచి 2008 జూలై 3 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులకు ఫిబ్రవరి 1వ తేదీ 6.00 గంటల నుంచి 14, ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, కొచి(కేరళ)లో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే డిప్లమా/బీఎస్సీ ఫార్మసీ 50 శాతం మార్కులు, ఇంగ్లీషులో 50 శాతం మార్కులు కలిగి 2003 జూలై 3 నుంచి 2006 జూలై 3వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులకు ఫిబ్రవరి 4వ తేదీ ఉదయం 6.00 గంటల నుంచి 14, ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్, కొచి(కేరళ)లో ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

140 బస్తాల ధాన్యం పట్టివేత


టీడీపీ నాయకులకు పట్టుబడిని ధాన్యం లోడ్‌తో ఉన్న వ్యాన్

కంచిలి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంపురం జంక్షన్ వద్ద ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 140 ధాన్యం బస్తాలతో శుక్రవారం వెళ్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఎటువంటి అనుమతులు, పత్రాలు లేకుండా అక్రమంగా ఒడిశా నుంచి రాష్ట్రానికి తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అంపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై పట్టుకుని సీఎస్‌డీటీకి అప్పగించామన్నారు. కాగా ఈ ధాన్యం ఒక ప్రజాప్రతినిధి బంధువులకు సంబంధించినవనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సీఎస్‌డీటీ కూర్మారావును సంప్రదించగా.. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, పట్టుకున్న ధాన్యాన్ని కంచిలి సుందరం ట్రేడర్స్ రైస్ మిల్లు వద్ద ఉంచినట్టు తెలిపారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 27: స్థానిక టౌన్‌హాల్ వేదికగా శుక్రవారం జిల్లాస్థాయి క్యాడెట్ ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు జిల్లా అధ్యక్షుడు బలభద్రుని రాజా ప్రారంభించారు. అండర్-17 బాల, బాలికలు పాల్గొనగా, వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతగా శిక్షకుడు జోగిపాటి వంశీ వ్యవహరించారు. ఇందులో ఎంపికైన వారికి ఈ నెల 28, 29వ తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్టు తెలిపారు. సంఘ ప్రతినిధులు ఎస్.నాయుడు, ఎం.సుధీర్ వర్మ, నగర కళింగ కోమటి సంఘం కార్యదర్శి వైశ్యరాజు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించండి


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో మహిళలపై లైంగిక వేధింపులు, వీధి బాలలతో భిక్షాటన చేయించడం, మానవ అక్రమ రవాణా తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి కార్యాలయంలో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. డీసీపీవో కేవీ రమణ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శాంతి ప్రియ పాల్గొన్నారు.

● ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక బాధ్యతగా పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలో శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో జిల్లాస్థాయి కన్సల్టెంట్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌వో శ్రీకాంత్, సీపీఎం ఆదిలింగం, డీఎస్‌పీఎం అపర్ణ, రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, శ్రీకాకుళం ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ రంగంలో యువతను ప్రోత్సహించాలి


ఖాదీ వస్త్రాలను పరిశీలిస్తున్న కమిషనర్

పొందూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పొందూరు ఖాదీకి భవిష్యత్తు ఉండాలంటే ఈ రంగంలో యువతను ప్రోత్సహించాలని యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కమిషనర్ కె.శారదాదేవి (ఐఏఎస్) అన్నారు. మండలకేంద్రంలో ఖాదీవస్త్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఖాదీరంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఖాదీనేత, వడుకు ప్రక్రియలను ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వర ప్రసాద్, డి.వెంకటరమణ, గాంధీ ఖాదీండార్ అధినేత బి.ప్రతాప్ వివరించారు. సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, సెట్‌శ్రీ మేనేజర్ వీవీ అప్పలనాయుడు ఉన్నారు.

గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

అరసవల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీలు అందిస్తున్న సేవలు అభినందనీయమని జనసేన పార్టీ నాయకుడు, గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. కమ్యునిటీ పారామెడిక్స్, హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం స్థానిక తోటపాలెం రోడ్డ వద్ద గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత పీఎంపీ వ్యవస్థాపక అధ్యక్షులైన ఆర్‌కే భరద్వాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యులు బుడుమూరు అన్నాజీరావు, అన్నెపు శివప్రసాద్, పైల మురళీధర్, అనిరుద్, శ్యామ్‌ప్రసాద్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన 50వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికల జట్లు పాల్గొని విజేతలుగా నిలవడంతో శుక్రవారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ క్రీడాకారులను అభినందించారు. విజయానికి సహకరించిన సంఘం ప్రతినిధులకు ప్రత్యేకంగా అభినందించి, మరిన్ని విజయాలతో తిరిగి రావాలని ఆశీర్వదించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాదు శ్రీనివాసరావు, శిక్షకులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తులు

అరసవల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్/10వ తరగతిలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి జనవరి 7 నుంను 27వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. వివరాలకు వాయుసేన వారి వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. 2005 జనవరి 1వ తేదీ నుంచి 2008 జూలై 1వ తేదీ మధ్యన పుట్టినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ పరీక్షకు మూడు రోజుల ముందు అడ్మిట్ కార్డులు అభ్యర్థుల వ్యక్తిగత మెయిల్‌కు వస్తాయన్నారు.

నేడు పాలవలస రైల్వే గేటు మూసివేత

సోంపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పాలవలస రైల్వే గేటు శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారి బీకే సాత్ తెలిపారు. సోంపేట నుంచి హరిపురం వెళ్లే మార్గంలో రైలు పట్టాల మరమ్మతుల నేపథ్యం ఈ గేట్‌ను మూసివేస్తున్నందున అందరూ సహకరించాలని కోరారు.

శంఖారావానికి తరలిరావాలి

బూర్జ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావానికి హిందువులంతా తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు పిల్లా జగన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొల్లివలస, చీడివలస గ్రామాల్లో కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు.

గుంతలు పూడ్చివేయించండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణ రోడ్లపై గంతులు ఏర్పడడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను 23వ వార్డు టీడీపీ నాయకులు ఎస్.శేఖర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

కృషితోనే విజయం

కంచిలి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విశ్వాసం, పట్టుదల కృషి ఉంటే విజయం మన సొంతం అవుతుందని గణిత అవధాని మద్దు తిరుపతిరావు మాస్టారు అన్నారు. శుక్రవారం జాతీయ గణిత దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా ఎస్ఆర్‌సీ పురం ఎంపీపీ స్కూల్ ఆవరణలో హెచ్ఎం ముకుందరావు ఆధ్వర్యంలో 262వ గణిత అవధానం, మేధా సంపత్తి ప్రదర్శన నిర్వహించారు. గణిత అవధాని శుష్యురాలు బాల మేధావి ఉలాల నందు (3వ తరగతి) గణితంలో వివిధ అంశాలపై పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో సమాధానాలు చెప్పి ఆకట్టుకుంది.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

ఎచ్చెర్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్-2 క్రీడా వేదిక ప్రాంగణాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం శ్రమదానం చేసి శుభ్రం చేశారు. క్రీడా ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారం తొలగించారు. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, క్యాంపస్-2 ఇన్‌చార్జి సాగర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ముకుందరావు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జూనియర్ బాలబలికల కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 29వ తేదీన నిర్వహించన్నుట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి, కార్యదర్శి ఎ.చిరంజీవి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 జనవరి 12 తర్వాత జన్మినంచిన వారై ఉండాలని, 20 సంవత్సరాలు మించరాదన్నారు. బాలుర బరువు 70 కేజీలు, బాలికల బరువు 65 కేజీలు ఉండాలన్నారు.

రణస్థలం బీజేపీ అధ్యక్షుడిగా అనంత్

రణస్థలం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా మహంతి అనంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గొప్పదార్శనికుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

రణస్థలం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్ప దార్శనికుడని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మన్మోన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

● అరసవల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గొప్ప ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని, దేశంలో సంస్కరణలకు పితామహుడని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎన్ ఈశ్వరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అకాల మరణం పార్టీకి తీరని లోటని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆమె స్వగృహంలో మాట్లాడారు. దేశం మంచి ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స వెంకటరమణ ఆధ్వర్యంలో పట్టణంలోని రామమందిరం కూడలి వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన అజయ్‌కుమార్ బెహరా

నందిగాం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం, ఒడి శా సమీపంలోని వాసుదేవపేట కు చెందిన అజయ్ కుమార్ బెహరా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అజయ్ కుమార్ బెహరా శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా లట్టిగాం సమీపంలోని హైవేపై కుక్క అడ్డంగా రావడంతో దాన్ని ఢీకొని బోల్తాపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇతడు ఓ ప్రైవేటు సంస్థలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసులు ప్రమాద విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు

పలాసరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పలాస మండలం గోదావరిపురం గ్రామంలో జారు శంకర్‌ను శుక్రవారం 46 సారా ప్యాకెట్లతో పట్టుకుని అరెస్టు చేసినట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కాశీబుగ్గ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ అధికారి కె.మల్లికార్జునరావు తెలిపారు. గ్రామంలో సారా అమ్ముతున్నట్లు సమాచారం మేరకు పరిశీలించగా పట్టుబడినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రానైట్ లారీ బోల్తా


బోల్తా పడిన గ్రానైట్ లారీ

మందస, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి- బరంపురం మార్గంలో మందస పీహెచ్‌సీ వద్ద శుక్రవారం ప్రమాదవశాత్తు గ్రానైట్ లారీ బోల్తాపడింది. తెల్లవారుజామున రెండు గ్రానైట్ బ్లాక్‌లతో వెళ్తుం డగా పీహెచ్‌సీ వద్ద రోడ్డు మెత్తగా ఉండడంతో లారీ బోల్తాపడినట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదం లో పీహెచ్‌సీకి చెందిన గోడ దెబ్బతినగా, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాదం జరిగిన అనంతరం లారీ డ్రైవర్ ఇంజిన్‌ను వేరు చేసి పరారయ్యాడు. కాశీబుగ్గ సీఐ ఎం.తిరుపతిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

అసిస్టెంట్ కుక్ ఇంటర్వ్యూకు 15మంది హాజరు

నందిగాం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం మదనాపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్‌ల నియామకానికి శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు 15మంది హాజరయ్యారు. నందిగాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ ఇంటర్వ్యూ నిర్వహించారు. రెండు పోస్టులకు 20మంది దరఖాస్తు చేసుకోగా 15 మంది హాజరయ్యారు. వీరికి తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో టి.రాజారావు, ఎంఈవో-2 ఎ.చిన్నారావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, ఎంపికైన వారి వివరాలను త్వరలోనే తెలియజేస్తామని వారు పేర్కొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త లూయిా పాశ్చర్

పాతపట్నం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త లూయిా పాశ్చర్ అని పశుసంవర్థక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక ప్రాంతీయపశు వైద్యశాలలో లూయిస్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. లూయిాపాశ్చర్ రేబిస్ వ్యాధికి టీకాలు కనుక్కోవడంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. పాలను వేడిచేయడం వల్ల చెడు బాక్టీరియా నశింపజేయవచ్చనే దృక్పథంతో ప్యాశ్చరైజేషన్ పద్ధతిని కనిపెట్టారన్నారు. పచ్చిపాలు తాగడంతో వచ్చే నష్టాలను పాశ్చరైజేషన్ వల్ల అరిక ట్టవచ్చని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఒడిరి కుమారి, విజయ్ కుమార్, నారాయణ, మోహన్, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ వైసీపీ ఆందోళన

నరసన్నపేట/పలాస/టెక్కలి/పాతపట్నం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. నరసన్నపేటలో మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పలాసలో మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు, టెక్కలిలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణదాస్, అప్పల రాజు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచేదిలేదంటూ ప్రజలకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తరువాత తుంగలో తొక్కి చార్జీలను పెంచి సామాన్యులపై పెనుభారం వేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించి నేడు వారికి సైతం అదనం గా బిల్లులు పంపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతి పత్రాలను అందించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలాసలో ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, పలువురు కౌన్సిలర్లు ముఖం చాటేశారు. టెక్కలిలో నందిగాం ఎంపీపీ శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, అన్నెపు రామారావు, సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ బారిన పడి జీవితాలు ఛిద్రం చేసుకోవద్దు


మాట్లాడుతున్న ఎస్ఐ లావణ్య

పాతపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ బారిన పడి జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. తెంబూరు గ్రామంలో శుక్రవారం 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల నడవడికలపై తల్లిదండ్రులు నిశితంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటని పలువురు నేతలు అన్నారు. ఆయన చిత్రపటాల వద్ద శుక్రవారం నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్

పలాస, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మాజీ ప్రధానిడా.మన్మోహన్‌సింగ్ అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికిపైలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థిక సరళీకృత విధానం అమలుతో పాటు హక్కులతో కూడిన సంక్షేమం భారతీయుల జీవితాలను మార్చిందని గుర్తు చేశారు. ఆర్బీఐ గవర్నర్‌గా విశిష్ట సేవలు అందించిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని, ఆయన మృతి దేశానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నేతలు పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, డొక్కరి శంకర్, నాటిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.


పలాస: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళిఅర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష

దేశానికి తీరనిలోటు

నరసన్నపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డా. మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టిన వ్యక్తి అని అన్నారు. దేశం ఓ మహోన్నత వ్యక్తిని కోల్పోయిందన్నారు.

దేశం ఓ ధ్రువతారను కోల్పోయింది

టెక్కలి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో దేశం ఓ ధ్రువతారను కోల్పోయిందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. 2009-14 సమయంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తనకు మంత్రిగా పనిచేసే అవకాశం లభించిందని గుర్తుచేసుకున్నారు. దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి కూడా తీరని లోటన్నారు. ● 2008 సెప్టెంబరు 5న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకునే సందర్భంగా నాటి ప్రధాని మన్మోహన్‌ను కలవడం తన అదృష్టమని, ఆయన మృతి తీరని లోటని జాతీయ ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత డీపీ స్టాలిన్ తన జ్ఞాపకాన్ని నెమరువేసుకుని నివాళి అర్పించారు.

పదో తరగతి మోడల్ పేపర్లు పంపిణీ

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బెండి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మోడల్ పేపర్లు అందించారు. పలాస లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ హెచ్‌వై దొర వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. ఈ మోడల్ పేపర్లను వినియోగించుకుని మంచి ప్రతిభ కనబరచాలన్నారు. అలాగే యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టి బాబు ఆధ్వర్యంలో హుకుంపేటలో 84 మంది విద్యార్థులకు మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పి.విజయకుమార్, డి.కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న జానపద కళాజాత

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజాం గ్రామంలో జనవరి 12న జానపద కళాజత ఏర్పాటు చేస్తున్నట్లు సిక్కోలు జానపద సాహిత్య కళాజాతర అధ్య క్షుడు రాపాక ధనరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జానపద కళాజా కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జానపద కళలను ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా కళాజాత నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పట్టి గీతా, మాజీ సర్పంచ్ పోతన పల్లి సాంబమూర్తి, గరుడ భద్ర సర్పంచ్ గూడ గిరిజ, ఎంపీటీసీ పిట్ట రామారావు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామాభివృద్ధి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే గ్రామాలు అభి వృద్ధి చెందాయని అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. శుక్ర వారం పూండి-గోవిదంపురం పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, ఉప సర్పంచ్ సత్యం, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

పోలాకి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయవినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి వ్యాసరచన, వకృత్వ పోటీల్లో దీర్ఘాశి ఉన్నత పాఠశాల విద్యార్థి బి.శ్యాంకుమార్ ప్రతిభ కనపరిచినట్లు హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరెడ్డి, గైడ్ రమేష్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్యాంకుమార్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అభినందించి ప్రశంసాపత్రం అందిం చడం ఆనందంగా ఉందన్నారు.

నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ లీజు రద్దు చేయాలి

కొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ లీజు రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కె.రవిచంద్రకు వినతి పత్రం అందించారు. ప్రజలు ప్రయాణికుల సౌకర్యం కోసం 1995లో నిర్మించిన కాంప్లెక్స్‌ను ఆర్టీసీ అధికారులు ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆలవెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, చిన్నారావు, సత్యాలు, రాజు, అప్పల రాజు తదితరులున్నారు.

మూలకు చేరిన ఆర్‌వో ప్లాంట్


పాడైన ఆర్‌వో ప్లాంట్ ఇదే..

మెళియాపుట్టి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మారడికోట పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారానికి గత టీడీపీ ప్రభుత్వంలో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుద్ధ జలాలను అందించింది. అయితే గడచిన ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ సరఫరా లేక వాటిని వదిలే శారు. అయితే గత ఏడాది అప్పటి ఎంపీ, ఇప్పటి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎంపీ నిధులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర ఏర్పాటు చేసి నీరిచ్చారు. అయితే గత రెండు నెలలుగా పథకం మరమ్మతులకు గురై నీటి సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పథకాన్ని పాతమారడి కోటలో నిర్మించారు. ఇక్కడి నుంచి పాతమారడి కొట, కొత్తమారడికొట, నాయుడు పోలూరు, నేరలోవ గ్రామాల ప్రజలు తాగునీటిని తీసుకువెళ్లేవారు. కొత్తమారడికోట గ్రామంలో అధికంగా తాగునీరు లేక అల్లాడుతున్నారు. గ్రామంలో ఉన్న బోరు నీరు తాగటం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన ఆర్‌వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీఎల్వోలు బాధ్యతాయుతంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బూత్‌లెవల్ ఆఫీసర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో టెక్కలి, కోటబొమ్మాళి మండలాల బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలోని మృతుల వివరాలు తొలగించడం, కుటుంబంలోని ఓటర్లను ఒకే చోటకు చేర్పించడం, తప్పులను సరిదిద్దడం, భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా ఓటర్ల జాబితా తయారుచేసే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి, కోటబొ మ్మాళి తహసీల్దార్లు సాధు దిలీప్ చక్రవర్తి, అప్పలరాజు, డీటీ అనిల్‌కుమార్ పాత్రో ఉన్నారు.

సోలార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

టెక్కలి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. పీఎం సూర్యాఘర్ పథకం కింద సబ్ కలెక్టర్ కార్యాలయానికి పది కిలోవాట్స్, ఆర్డీవో నివాసానికి మూడు కిలోవాట్స్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు జరిగాయి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు సిస్టమ్స్ మొరాయించ డం, సిబ్బంది అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. విద్యుత్ అంతరాయం నుంచి గట్టెక్కేందుకు ప్రధాన మంత్రి సూర్యాఘర్ పథకం కింద ప్రతిపాదనలు చేశామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు.

15 శాతం వేతనం పెంచేందుకు అంగీకారం

● మిల్లర్లు, కార్మికుల మధ్య చర్చలు సఫలం


కరచాలనం చేసుకుంటున్న మిల్లర్లు, కార్మిక సంఘ నేతలు

పలాసరూరల్,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ ఏడాది 15 శాతం వేతనాలు పెంచేందుకు అంగీకారం కుదిరింది. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి చెందిన రైస్‌మిల్లర్లు, కార్మికుల మధ్య చర్చలు నిర్వహించారు. ఇరువర్గాల ప్రతినిధులు మాట్లాడుకుని ఈ మేరకు అంగీకారం తెలిపారు. రైతులు, కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంచి మనసుతో ఈ ఒప్పందాన్ని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి సమక్షంలో నిర్వహించినట్లు ఇరువర్గాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మిల్లుల యాజమానులు డోకి రామారావు, సిందిరి కిశోర్, కార్మిక సంఘం ప్రతినిధి అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాపాలు రాష్ట్రానికి శాపాలు: కలమట


మాట్లాడుతున్న కలమట వెంకటరమణమూర్తి

కొత్తూరు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చేసిన పాపాలు నేడు రాష్ట్రానికి శాపాలుగా మారాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రా న్ని అధోగతి పాల్జేశా రన్నారు. 2019లో టీడీపీ ప్రభుత్వం దిగేపోయేసరికి మిగులు కరెంట్‌తో రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డికి అప్పగించామన్నారు. అయితే నాడు రాష్ట్రాన్ని నాశనం చేసి ఇప్పుడు వైసీపీ నాయకులు ధర్నా చేయడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో నాయకులు లోతుగెడ్డ భగ వాన్‌దాసు నాయుడు, కన్నంనాయుడు, రాజారావు, ఎద్దు శ్రీనివాసరావు, త్రినాథ రావు, వాసు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కొత్తూరుకు చెందిన మాజీ ఎంపీటీసీ, పార్టీ సీనియర్ నేత చోడవరపు జోగి నాయుడుకు ఇటీవల ద్విచ క్రవాహనం ఢీకొనడంతో తలకు గాయం కాగా విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ శుక్రవారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ అక్రమ వాడకంపై కేసు నమోదు

హిరమండలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గులుమూరు పంచాయతీ చాపరాయ గూడలో నిర్వహి స్తున్న రవిచంద్ర ఆశ్రమానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆశ్రమానికి విద్యుత్ సరఫరా చేసే లైన్లను పరిశీలించారు. ఈ సమయంలో మీటరు లేకుండా మెయిన్‌లైన్ నుంచి నేరుగా విద్యుత్ వాడుతు న్నట్లు గుర్తించామని విజిలెన్స్ ఏఈ కృష్ణారావు తెలిపారు. నిర్వాహకుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. పరిశీలనలో స్థానిక ఏఈ మురళీ మోహన్, ఆర్ఐ కాని స్టేబుల్ గోవిందరావు ఉన్నారు.

స్థల వివాదంపై విచారణ

ఇదిలా ఉండగా సదరు రవిచంద్ర ఆశ్రమంలో శుక్రవారం రెవిన్యూ అధికా రులు విచారణ చేపట్టారు. ఆశ్రమం ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టినట్లు వివాదం రావడంతో ఆర్ఐ ఉమాశంకర్, వీఆర్వో శంకరరావు గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టారు. గ్రామస్థులు మాట్లా డుతూ ఆశ్రమం నిర్వహిస్తున్న స్థలంలో గతంలో తమకు ప్రభుత్వం డి-పట్టాలు ఇచ్చిందని చెప్పారు. ఈ స్థలాలు సాగు చేసేందుకు అనుకూలంగా లేకపోవడంతో ఆశ్రమం ఏర్పాటు కు కొంతస్థలం తామే ఇచ్చామని, ఇది ఆక్రమణ కాదని వివరణ ఇచ్చారు.

వైసీపీ నేతలది అత్యుత్సాహం: శిరీష

పలాస, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచ కుండానే పెంచినట్లు వైసీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 2014-19 కాలంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. విద్యుత్ సంస్కరణల కారణంగా దేశం లోనే రాష్ట్రం ప్రథమంగా నిలిచిందన్నారు. వైసీపీ హయాంలో ఇష్టా రాజ్యంగా విద్యుత్‌చార్జీలు పెంచారని, విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.80 వేల కోట్లు బకాయిలు పెట్టిన ఘనత అప్పటి సీఎం జగన్‌కే దక్కిం దన్నారు. వారి అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. ఈ కారణంగానే వైసీపీని ప్రజలు గద్దె దింపారన్న విషయం ఆ పార్టీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. వారు చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నాన్ని కూటమి ప్రభుత్వం చేస్తోందని శిరీష పేర్కొన్నారు.

ఆదర్శనీయుడు స్వామిబాబు


స్వామిబాబు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, దాత పొట్నూరు స్వామిబాబు ఆదర్శనీయుడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎంఆర్ జ్యోతిఫ్రెడరిక్ అన్నారు. స్వామిబాబు 141 జయంతి సందర్భంగా శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యసమరంలో పోరాడడమే కాకుండా నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆసుపత్రి, కళాశాల, పాఠశాలలతో పాటు పేదలకు భూములను అందించిన వ్యక్తి స్వామిబాబు అని, ఆయనను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉన్న రంగనాథం, సూరిబాబు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మండల సమావేశం

నరసన్నపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శని వారం మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి గత సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై వివిధ శాఖల అధికారులు సమగ్రమైన నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

నేడు పోలాకిలో..

పోలాకి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ బడ్జెట్ సమావేశం శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో గరిమెళ్ల వెంకట రవికుమార్, సూపరింటెండెంట్ బలగప్రకాష్ తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించ నున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలన్నారు. 2024-25 సంవ త్సరం బడ్జెట్ ఆమోదించనున్నామన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు.

యువతలో చైతన్యం పెరగాలి

నరసన్నపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశసమగ్రత, రక్షణకు పాటు పడేలా యువతలో చైతన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తీసుకువచ్చేందుకు ఆల్ ఇండియా యువజన సమాఖ్య రాష్ట్ర నాయకులు నాగభూషణం, కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ మహాసభల లోగోను ఆవిష్కరించారు. యువత చెడుమార్గంలోకి వెళ్లకుండా తగిన సూచనలివ్వాలని, దేశ ప్రగతికి నడుంబిగించేందుకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

భయాన్ని తొలగించేందుకు 'పరీక్ష పే చర్చ'

నరసన్నపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ ప్రతిఏటా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు. శుక్రవారం పరీక్ష పే చర్చపై ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న ఒత్తిడి తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పీఎం నరేంద్రమోదీ నేరుగా ఈ యాప్ ద్వారా విద్యార్థులతో మాట్లాడే అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. అలాగే హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. అపార్‌ను పూర్తి చేయాలని, ఆదివారాల్లో ప్రైవేటు పాఠశాలలు తీయరాదని ఆయన పేర్కొన్నారు.

వివిధ అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పలాస, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ కమిషనర్ ఎన్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం ద్వారా జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న పెయింటర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీ షియన్లు, ఏసీ, గీజర్, టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ రిపేర్లు, బ్యూటీషియన్ల కోర్సుల కోసం ఈనెల 31వ తేదీ లోగా మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రేషన్, ఆధార్, పాన్ కార్డులతో పాటు బ్యాంక్ పాసుపుస్తకాలతో హాజరుకావాలని కమిషనర్ కోరారు.

సత్యసాయి మందిరానికి రూ.లక్ష వితరణ


విరాళం అందిస్తున్న దృశ్యం

హిరమండలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హిరమండలం దేవరశెట్టి వీధిలో ఉన్న సత్యసాయి మందిరం నూతన భవన నిర్మాణానికి ఎన్ఆర్ఐ అంధవరపు కోటేశ్వరరావు రూ.లక్ష వితరణ చేశారు. శుక్రవారం కన్వీనర్ వెంకటరమణకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ... మందిర నిర్మాణానికి తన వంతు పూర్తి సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బెహర సురేష్, సింహాద్రి కాశీప్రసాదరావు పాల్గొన్నారు.

బిచ్చగాళ్లకు దుప్పట్ల పంపిణీ


అనాథకు దుప్పటి అందిస్తున్న యువకులు

హరిపురం, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): హరిపురం పరిసర ప్రాంతాల్లో బిచ్చగాళ్లు, అనాథలు సుమారు 20 మందికి స్థానిక యువకులు దుప్పట్లను పంపిణీ చేశారు. చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్న దుస్థితిని ఎదుర్కొంటున్న వారి దుస్థితిని చూసి అంబుగాం గ్రామానికి చెందిన మజ్జి హేమరాజుతో పాటు పలువురు యువత వారందికీ దుప్పట్లు పంపిణీ చేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్‌ఫర్ ఆల్ అధ్యక్షులు గొలుసు మురళి, ఇప్పిలి వెంకటరావు, రౌతు చిరంజీవి, మల్లి తదితరులు పాల్గొన్నారు.